క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా చదవాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని జిల్లా అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ డి.గౌరీశంకర్ అన్నారు. స్థానిక వంకాయలవారి వీధిలోని సిటీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు పదికి పది పాయింట్లు సాధించడమే లక్ష్యంగా చదవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం వైవీ రామారావు, ఉపాధ్యాయులు రత్న ఏంజిల్, సీఆర్పీ జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన



బాక్సింగ్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న జక్కంపూడి గణేష్, గొందేశి శ్రీనివాసులరెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: ఇటీవల రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ స్కూల్లో జరిగిన 66వ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్ 14, 17, 19 బాలుర, బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బొమ్మూరుకు చెందిన శ్రీమారుతి సెల్ఫ్ డిఫెన్స్ అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అండర్–14 కేటగిరీ 42–44 కిలోల బాలుర విభాగంలో డి.అఖిలేష్‌నారాయణ సిల్వర్ మెడల్, బెస్ట్ బాక్సర్ అవార్డు, 44–46 కిలోల విభాగంలో కె.కేశవగంగాధర్ బ్రాంజ్ మెడల్‌ను సాధించారు. బాలికల విభాగంలో అండర్–17 కేటగిరీ 42–44 కిలోల విభాగంలో టి.హర్షిణి, 44–46 కిలోల విభాగంలో జి.నైసీ, 48–50 కిలోల విభాగంలో జి.అక్షిత, 60–63 కిలోల విభాగంలో ఇ.సంగీత బ్రాంజ్ మెడల్స్‌ను, బెస్ట్ ఫైటర్స్ అవార్డులను గెలుచుకున్నారు. విజేతలను, కోచ్‌లు ఎన్.గిరివెంకటరమణ, ఎం.గణేష్, ఎం.భవానీశంకర్‌లను వైఎస్సార్ సీపీ నేత జక్కంపూడి గణేష్, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొందేశి శ్రీనివాసులరెడ్డి అభినందించారు.

గంజాయి స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక గౌతమీ జీవకారుణ్య సంఘం ఎదురుగా ఉన్న గోదావరి బండ్ వద్ద కొందరు గంజాయి కలిగి ఉన్నట్లు పోలీసులకు తెలిసింది. వెంటనే వారు ఆ ప్రాంతంలో పరిశీలించారు. ఆనంద్ రీజెన్సీ ప్రాంతానికి చెందిన సందాక రామకృష్ణ, సోమాలమ్మ టెంపుల్ ప్రాంతానికి చెందిన శీలం వీరవెంకట సత్యనారాయణలు ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకుని నగరానికి వచ్చారు. వారు గోదావరి బండ్‌పై దడాల సాయితేజ, కూలి ధనుప్రకాష్, సాకా రాజేష్‌లతో గంజాయి బ్యాగ్‌లను మార్చుకుంటున్నారు. ఆ సమయంలో 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌కు కృషి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర ప్రభుత్వం ఆశయమైన 'డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' సాకారానికి విద్యార్థులు కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ అన్నారు. శనివారం దానవాయిపేటలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ×డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్×పై విద్యార్థులకు ఆయన ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సేవనం ద్వారా వచ్చే ఆరోగ్య, మానసిక, సామాజిక సమస్యలపై వివరించారు. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు వంటివి జరిగితే టోల్ ఫ్రీ నంబరు 14500కు తెలపాలన్నారు. ఎస్ఈబీ ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

ప్రధానికి ధన్యవాదాలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ సమాన్ యోజనను 2023–2024 వార్షిక బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ప్రధాని మోదీకి విశ్వకర్మ పనివారితో కలసి బీజేపీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. శనివారం పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ ఆధ్వర్యంలో శాటిలైట్‌సిటీలో నాయకులు విశ్వకర్మలను కలసి ప్రధాని ప్రవేశపెట్టిన పథకంపై అవగాహన కల్పించారు. నాయకులు కురగంటి సతీష్, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు యానాపు ఏసు మాటాడారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న వీర్రాజు

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సుదర్శన హోమం నిర్వహించారు. రాత్రి స్వామివారికి సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట భజనలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం 10 గంటలకు చక్రస్నానం, రాత్రి శ్రీపుష్పయాగం జరుగుతాయని ఆలయ భక్త బృందం తెలిపింది. స్వామివారిని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు దర్శించుకున్నారు. ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, మాజీ ఎంపీటీసీ టేకి శ్రీనివాసరావు, నాయకులు ఉరదాల శ్రీరాములు ఉన్నారు.

యువతి అదృశ్యం

ధవళేశ్వరం: స్థానిక లక్ష్మీజనార్దనస్వామి కాలనీకి చెందిన ఉరుకుర్తి సాయిమాధవి (19) అదృశ్యమైనట్లు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 1న రాత్రి నుంచి ఆమె కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు చేసింది.

దృష్టి పెట్టండి.. పరిష్కారం చూపండి

అధికారులకు ఎంపీ భరత్‌రామ్ ఆదేశాలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలు తెలుపుతున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే పరిష్కారం చూపాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదేశించారు. శనివారం స్థానిక 22వ డివిజన్‌లో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. అక్కడి శంకర మఠం, రాఘవేంద్రస్వామి గుడి, వంకాయలవారి వీధి, గోదావరి గట్టు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రధానంగా డ్రైనేజీ సమస్య గురించి ఎంపీకి మొరపెట్టుకున్నారు. వర్షం వస్తే మురుగు కాలువల్లో నీరు రోడ్లపైకి చేరుతుందని తెలిపారు. దీంతో ఆయన కాలువకు అనుసంధానంగా ఉన్న మైనర్ డ్రైనేజీలను పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఈ సమస్యపై నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీలలో పేరుకుపోయిన సిల్ట్ తొలగించి, నీరు ముందుకు పారేలా చూడాలన్నారు. పూడికలు పేరుకుపోవడానికి గల కారణాలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జి దూర్వాసుల సత్యనారాయణ, కొత్తా బాలమురళి, కొత్తా విజయ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

పేదలకు సంక్షేమ పాలన అందించడమే సీఎం జగన్ లక్ష్యమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శనివారం స్థానిక 10వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తెలియజేస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ నవరత్న పథకాలతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే వచ్చే ఎన్నికలలో తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

కంబాలచెరువు: ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక పుష్కర ఘాట్‌లో విద్యార్థులంతా మానవహారంగా ఏర్పడ్డారు. జీఎస్ఎల్ క్యాన్సర్ ట్రస్ట్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాణాంతకం కాదని, దీనికి అద్భుతమైన వైద్యం వచ్చిందన్నారు. మరో అతిథి మంజులా నాయుడు మాట్లాడుతూ నేడు ఆహారంలో మార్పులతో క్యాన్సర్ వ్యాధికి కారణమవుతుందన్నారు. అనంతరం ర్యాలీ కందకం రోడ్డు, దేవీ చౌక్ మీదుగా హైటెక్ బస్టాండ్ వద్దకు చేరుకుని ముగిసింది. రోటరీ క్లబ్ నగర ఐకాన్ ప్రెసిడెంట్ తీగెల రాజా, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎస్‌కేఆర్ కళాశాల ఆధ్వర్యంలో క్యాన్సర్ డే జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి, హీ ఆయోష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ లలితా కంభంపాటి కె.రమాదేవి, వీబీటీ సుందరి, ఎం.శ్రీదేవి, సీహెచ్ ప్రియాంక పాల్గొన్నారు.

ఉద్యమం తీవ్రతరం చేస్తాం

ప్రకాశంనగర్: పేపర్‌మిల్లు యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ అన్నారు. శనివారం పేపర్ మిల్లు కార్మికులు చేస్తున్న 25వ రోజు దీక్షలకు సీఐటీయూ మద్దతు తెలిపింది. అరుణ్ మాట్లాడుతూ గుర్తింపు ఎన్నికలను వెంటనే జరపాలని, క్యాంటీన్ రేట్లను తగ్గించాలని, కాంట్రాక్ట్ కార్మికులను సీనియారిటీ ప్రకారం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు టి.నాగేశ్వరరావు, వి.రాజా, ఎం.కిశోర్, టి.సత్యనారాయణ తదితరులు దీక్షలో కూర్చున్నారు. జిల్లా కార్యదర్శి పూర్ణిమ్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీ పడే ప్రసక్తే లేదు

ఎంపీ మార్గాని భరత్‌రామ్



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నగర అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేస్తానని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శనివారం స్థానిక వివేకానంద జంక్షన్ నుంచి సీతంపేట జంక్షన్ వరకూ రూ.65 లక్షలతో తారు రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అదే విధంగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలో రూ.87 లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నగరాభివృద్ధి విషయంలో తనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఆయన ప్రోత్సాహంతోనే నగరంలో రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించామని అన్నారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, నగర కమిషనర్ కె.దినేష్‌కుమార్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆయా వార్డుల ఇన్‌చార్జులు అరిగెల బాబురాజేంద్రప్రసాద్, కుక్కా తాతబ్బాయి, నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు వచ్చాయని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శనివారం మురమండలో మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. అక్కడి సచివాలయం–1 పరిధిలోని గృహాలను సందర్శించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను చందన ఆదేశించారు. గడప గడపకూ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులను గుర్తించి, వారి ఇంటికే సంక్షేమ పథకాలను అందజేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని నాగేశ్వర్ అన్నారు. అంతకు ముందు వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అయిన



మురమండలో పథకాల గురించి వివరిస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

విల్లి వెంకటేశ్వర్లు, గారపాటి బుజ్జిబాబు, ఈదర దీనదయాళ్, పాతూరి వెంకటరాయుడు చౌదరి, దేవళ్ల సత్యనారాయణ, కొప్పాక రమణ, వెంపాటి గంగారావు, ఊటుకూరి శైలజ, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో బీసీలకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ బీసీ సంఘ రాష్ట్ర కన్వీనర్ దుర్గానరేష్ యాదవ్

రాజమహేంద్రవరం సిటీ: దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేంద్ర ప్రభుత్వ విధానాలతో అడుగడుగునా అన్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ యాదవ్ అన్నారు. శనివారం స్థానిక వీఎల్ పురంలో గాండ్ల, తెలుకుల సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీసీల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఈ నెల 8, 9 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. కేంద్ర బడ్జెట్ బడా వ్యాపారులు, అగ్రవర్ణాలను పెంచి పోషించేలా ఉందన్నారు. బడ్జెట్ ద్వారా బీసీల వెన్నెముక విరిగేలా చేసిన కేంద్ర ప్రభుత్వం దిగొచ్చే వరకూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. బీసీ సంఘంలోని కొందరు ఇచ్చిన సమాచారం మేరకు రాష్ట్ర కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న నరవ గోపాలకృష్ణను సస్పెండ్ చేస్తున్నట్టు తానే ప్రకటించానని, ఆ తరువాత తప్పు తెలుసుకుని ఆర్.కృష్ణయ్య తదితర నేతలతో చర్చించి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు మరుకుర్తి కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీ సంఘానికి చెడ్డపేరు తెచ్చే నాయకులు ఏ పార్టీలో ఉన్నా వారిని పక్కకు తప్పిస్తామన్నారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల సీతారత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ భవానీ గణేష్, పిల్లా నివాస్, బీసీ యువసేన వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్‌కుమార్, అంకం గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల క్రికెట్ మ్యాచ్

రాజమహేంద్రవరం సిటీ: నిత్యం పరిపాలన పరమైన ఒత్తిడితో బాధ్యతలు నిర్వర్తించే ఉద్యోగులకు కొంత పని ఒత్తిడి నుంచి ఉపశమనానికి క్రీడలు దోహదపడతాయని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి జీఎస్ఎల్ క్రీడా మైదానంలో స్నేహపూర్వక వాతావరణంలో కలెక్టర్ లెవెన్ వెర్సెస్ ఎస్పీ లెవెన్ పొట్టి క్రికెట్ ఫార్మెట్‌లో మ్యాచ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు ఈ మ్యాచ్ తిలకించేందుకు జీఎస్ఎల్ కళాశాల ఆధ్వర్యంలో మైదానంలో ఏర్పాటు చేశామన్నారు.

అలసత్వం ప్రదర్శించొద్దు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' (స్పందన)పై అలసత్వం ప్రదర్శించరాదని కలెక్టర్ ఆదేశించారని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ తెలిపారు. శనివారం జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జగనన్నకు చెబుదాంపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యగోవింద్ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులపై విజిట్ ఫొటో, చర్చించిన ఫొటో, పరిష్కరించిన ఫొటోతో పాటు సంతృప్తి చెందినట్లు ఇచ్చిన ఫిర్యాదుదారుని లెటర్‌తో పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

'పాప్‌కార్న్' ఓ అల్లరి లవ్‌స్టోరీ

హీరో సాయి రోనక్



సమావేశంలో మాట్లాడుతున్న హీరో సాయి రోనక్, పక్కన హీరోయిన్ అవికా గోర్, దర్శకుడు మురళి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పాప్‌కార్న్ సినిమా ఓ అల్లరి లవ్‌స్టోరీ అని, ఇది అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందని హీరో సాయి రోనక్ అన్నారు. సాయి రోనక్, చిన్నారి పెళ్లికూతురు ఫేమ్ అవికా గోర్ జంటగా మురళీ గంధం దర్శకత్వంలో ఎంఎస్ చలపతిరాజు సమర్పణలో బోగేంద్ర గుప్తా నిర్మించిన 'పాప్‌కార్న్' చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ నగరంలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించింది. హీరో సాయి రోనక్ మాట్లాడుతూ ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విడుదల చేస్తున్న ఈ సినిమాను చూసి ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారన్నారు. ఓటీటీలు వచ్చినప్పటికీ థియేటర్‌లో విడుదలైన సినిమాలనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారని హీరో తెలిపారు. హీరోయిన్ అవికా గోర్ మాట్లాడుతూ పాప్‌కార్న్ చిత్రంపై నమ్మకంతో సహ నిర్మాతగా తాను వ్యవహరించానన్నారు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన యువతి, యువకుడి మధ్య సన్నివేశాలతో ఈ చిత్రం తెరకెక్కించినట్టు చెప్పారు. ఇప్పటికే సినిమా ట్రైలర్, పాటలకు విశేష స్పందన వచ్చిందన్నారు. చిత్ర దర్శకుడు మురళీ గంధం మాట్లాడుతూ ఈ సినిమా ఒక డిఫరెంట్ కథతో నిర్మించామన్నారు. లిఫ్ట్‌లో రెండు గంటల పాటు కేవలం హీరో, హీరోయిన్ల మధ్య జరిగిన సంఘటనలే పాప్‌కార్న్ అని తెలిపారు. పాప్ కార్న్‌లో 'ఆర్'ను ప్రత్యేకంగా చూపించామని, దీనికి అర్థం ఏమిటన్నది సినిమాలోనే తెలుస్తుందన్నారు. లిఫ్టులోనే నాలుగు పాటలు చిత్రీకరించామన్నారు. ప్రేమ, కోపం అనేక హావభావాలను లిఫ్టులో హీరో హీరోయిన్‌ల మధ్యే రెండు గంటల పాటు చూపించడం అనేది కత్తి మీద సాము లాంటిదేనని, దానిని తాము విజయవంతంగా చూపించగలిగామని నమ్మకం వ్యక్తం చేశారు. కోవిడ్ తొలి దశలో తనకు వచ్చిన ఆలోచనతో ఈ కథను తయారు చేశానని తెలిపారు. స్క్రిప్ట్ విన్న నిర్మాత భోగేంద్ర గుప్త కథను నమ్మి చిత్ర నిర్మాణానికి ముందుకు వచ్చారన్నారు. మరో నిర్మాత చలపతిరాజు ఎంతో సహకారం అందించారన్నారు. ఈ చిత్రం యువతకే కాకుండా కుటుంబ సమేతంగా అలరించేదిగా ఉంటుందన్నారు. నిర్మాత చలపతిరాజు మాట్లాడుతూ గత నెల నాల్గవ తేదీన సినీ నటుడు నాగార్జున చేతుల మీదుగా చిత్ర ట్రైలర్ విడుదల చేశామన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి తానేటి వనిత, రూరల్ కో ఆర్డినేటర్ నాగేశ్వర్ తదితరులు

ధవళేశ్వరం: జాషువా ఇంటిగ్రిటి మిషన్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని హోం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. శనివారం ధవళేశ్వరం ఎర్రకొండ హోప్ సెంటర్ ఆవరణలో జాషువా ఇంటిగ్రిటి మిషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 600 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ హోప్ సెంటర్ సేవలు ప్రశంసనీయమన్నారు. పార్టీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలన్న తలంపుతో ముందుకు వెళుతున్న ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడం దేవునికి సేవ చేయడమేనని పేర్కొన్నారు. అనంతరం వారి చేతుల మీదుగా పేదలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎలీషా కాలేపల్లి, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు పూర్తి భద్రత

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హిండెన్ బర్గ్ నివేదికలోని నిజానిజాలను బయట పెట్టడానికి, ప్రభుత్వం నిష్పాక్షిక విచారణ చేయాలని ఎల్ఐసీ ఉద్యోగ సంఘాల జాయింట్ ఫ్రంట్ విజ్ఞప్తి చేసింది. ఎల్ఐసీలో పెట్టుబడుల వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఒక ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఉందని, లోతైన పరిశీలన తర్వాతే ఈ బోర్డ్ పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపింది. అందువల్ల ఎల్ఐసీ పాలసీదారుల పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని భరోసా ఇచ్చింది. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ క్లాస్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ నేషనల్ ఫీల్డ్ వర్కర్స్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, డివిజన్ నాయకులు బెనర్జీ, సతీష్, రాంబాబు, కోదండరామ్, మాథ్యూస్, గన్నియ్య తదితరులు ఓ ప్రకటనలో తెలిపారు.